సాక్షి
నారాయణపేట
సోమవారం। 20। అక్టోబర్। 2025

దీపావళి శుభాకాంక్షలు

న్యూస్‌రీల్

అన్యాయంగా దుకాణాలు కూల్చేశారు..



మద్దూరు: ఎలాంటి నోటీసులు లేకుండా రాత్రికి రాత్రే తమ వ్యాపార దుకాణాలను కూల్చేశారని.. తమకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం బాధితులు రోడ్డెక్కారు. మద్దూరు పాతబస్టాండ్‌ చౌరస్తాలో బైఠాయించి ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని రెనివట్ల చౌరస్తా నుంచి చెన్నారెడ్డిపల్లి మీదుగా మోమినాపూర్‌ వరకు రూ. 33.60కోట్లతో 6 కి.మీ. మేర రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా పట్టణంలోని రెనివట్ల చౌరస్తా నుంచి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం వరకు 70 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను 4 రోజుల క్రితం అధికారులు చేపట్టారు. అయితే చౌరస్తాలో ప్రభుత్వ ఆస్పత్రి వైపు 8మందికి వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రి వైపు 35 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ కోసం ఆదివారం తెల్లవారుజామున పోలీసులు, మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీకాంత్‌ ఆధ్వర్యంలో దుకాణాలను కూల్చివేశారు. దీంతో కడుపు మండిన బాధితులు ధర్నా చేపట్టారు. వారి ఆందోళనకు బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్‌ మద్దతు పలికారు. దాదాపు 2గంటల పాటు పాతబస్టాండ్‌ చౌరస్తాలో చేపట్టిన ధర్నాతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కోస్గి సీఐ సైదులు అక్కడికి చేరుకొని బీజేపీ నాయకుడిని బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించి ధర్నాను విరమింపజేశారు.

దివ్యకాంతుల దీపావళి

చెడుపై గెలిచిన మంచికి ప్రతీకగా సంబరాలు

- నేడు జిల్లావ్యాప్తంగా వేడుకలు
- వ్యాపార సముదాయాలు, ఇళ్లలో లక్ష్మీపూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఇంటిల్లిపాదిని ఆనందోత్సాహాల్లో నింపే దీపావళి పండుగ సందడి మొదలైంది. చెడుపై గెలిచిన మంచికి ప్రతీకగా జరుపుకొనే దీపావళి పర్వదినాన్ని సోమవారం వైభవంగా నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. వరుస సెలవుల రాకతో దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. యువత, చిన్నారులు టపాసులు కాల్చడానికి సర్వం సిద్ధం చేసుకున్నారు. ముందుగానే గృహాలు, వ్యాపార సముదాయాలకు రంగులు అద్దారు. లక్ష్మీపూజలు, నోములకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ సందడిగా మారాయి. బాణాసంచా, ప్రమిదలు, బంతిపూలు, స్వీట్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. అదే విధంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

– నారాయణపేట

వెలుగుల దివ్వెలు..

దీపావళి పర్వదినం సందర్భంగా ఇంటిల్లిపాది లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ.. మట్టితో చేసిన ప్రమిదల్లో వీలైనన్ని దీపాలు వెలిగిస్తారు. ప్రమిదల తయారీ వెనక ఎంతో మంది శ్రమ దాగి ఉంది. కుమ్మరులు స్థానికంగా ప్రమిదలను తయారు చేయడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి వివిధ డిజైన్‌లలో ప్రమిదలు మార్కెట్లో లభిస్తున్నాయి. మట్టి ప్రమిదలతోనే దీపాలకు ప్రాధాన్యతనిస్తూ.. పర్యావరణ దీపావళి జరుపుకోవాల్సిన అవసరం ఉంది.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త..

బాణాసంచా కాల్చేటప్పుడు ఆనందంతో పాటు అప్రమత్తత అవసరం. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం పొంచి ఉంటుంది. పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణాసంచా కాల్చాలి. పేలని టపాసులను మళ్లీ కాల్చేందుకు చిన్నారులు యత్నించడం వల్ల గాయపడే ప్రమాదం ఉంటుంది. మండే స్వభావం కలిగిన వస్తువులకు దూరంగా మైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో బాణాసంచా కాల్చడం ఉత్తమం. కాకరవత్తులు, విష్ణుచక్రాలు కాలిన తర్వాత వాటి ఇనుప తీగలను ఎక్కడపడితే అక్కడ పడేయవద్దు. వాటితో మనుషులతో పాటు పశువులు, జీవాలకు ప్రమాదం పొంచి ఉంటుంది. కాటన్‌ దుస్తులు, కళ్లద్దాలు ధరించేలా పిల్లలను ప్రోత్సహించాలి.



జిల్లా కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న బంతిపూలు, ప్రమిదలు

గోగునార కట్టలతో దిష్టితీత..

దీపావళి సందర్భంగా 'దివ్వి దివ్వి దీపావళి' అంటూ పిల్లలు ఉత్సాహంగా పాటలు పాడుతుండగా.. పెద్దలు గోగునార కట్టలతో చేసిన దుందువాతో దిష్టి తీస్తారు. చాలా గ్రామాల్లో ఈ సంప్రదాయం కొనసాగుతోంది. సోమవారం ఈ వేడుక నిర్వహించనున్నారు. పొలాల్లో ఉన్న జీనుగ, పుంటికూర (గోగునార) కట్టలు తీసుకొచ్చి చిన్నచిన్న గుడ్డ పీలికలతో కాగడాలు వెలిగించి దిష్టి తీయడం ఆనవాయితీ. దీన్ని వాడుక భాషలో దుందువాగా పిలుస్తారు.

మార్వాడీలకు ప్రత్యేకం..

రాజస్థాన్‌ మార్వాడీలకు దీపావళి పండుగ ఎంతో ప్రత్యేకం. దాదాపు 300 ఏళ్ల క్రితమే రాజస్థాన్‌ నుంచి మార్వాడీల కుటుంబాలు నారాయణపేటకు వ్యాపార నిమిత్తం వచ్చి స్థిరపడ్డారు. పిల్లల చదువులు, వ్యాపారాల నిమిత్తం కొంత మంది హైదరాబాద్‌లో సైతం ఉంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో 100కి పైగా రాజస్థాన్‌ కుటుంబాలు ఉన్నాయి. వారు రాజస్థాన్‌ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా పండుగను ఇంటిల్లిపాది జరుపుకొంటారు. దీపావళిని ప్రతి కుటుంబం ఆనందోత్సవాల మధ్య ఐదు రోజుల పాటు నిర్వహించుకుంటారు. మొదటి రోజు ధందేరాసు నిర్వహిస్తారు. ఇంటిల్లిపాది లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారు. రెండో రోజు రూప్‌ చౌదాస్‌ వేడుకలు, సోమవారం సాయంత్రం 6 గంటల తర్వాత లక్ష్మీదేవి పూజలు నిర్వహించి టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొంటారు. నాలుగో రోజు గోవర్ధన్‌ పూజ (ఆవుపేడతో) నిర్వహిస్తారు. ఐదో రోజు బైదూజ్‌ వేడుకలు చేసుకుంటారు.

సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా..



రాజస్థాన్‌ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా దీపావళి పండుగను నిర్వహించుకుంటాం. మా ముత్తాతలు 300 ఏళ్ల క్రితం నారాయణపేటకు వచ్చారు. ఇంటిల్లిపాది అందరం దీపావళి పండుగను ఆనందంగా జరుపుకొంటాం. లక్ష్మీనారాయణ భగవానుడికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటాం.

– మురళీ భట్టడ్, నారాయణపేట

సురక్షితంగా పండుగ జరుపుకోవాలి



ప్రజల భద్రతే పోలీసుశాఖకు అత్యంత ప్రాధాన్యమని.. దీపావళి పర్వదినాన్ని బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ఎస్పీ డా.వినీత్‌ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో ప్రమాదరహితంగా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. ముఖ్యంగా లైసెన్స్‌ పొందిన దుకాణదారుల వద్దే బాణాసంచా కొనుగోలు చేయాలని సూచించారు. పిల్లలు పెద్దల సమక్షంలో మండే వస్తువులకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే పటాకులు కాల్చాలన్నారు. వెలగని క్రాకర్లను తిరిగి వెలిగించరాదన్నారు. జంతువులు లేదా మనుషుల వైపు పటాకులు విసరవద్దన్నారు. కర్టెన్లు, కాగితపు అలంకరణలు, విద్యుత్‌ వైర్లకు దూరంగా ఉంచాలన్నారు. వెలిగించిన దీపాలను గమనించకుండా వదిలి పెట్టరాదన్నారు. నాణ్యత కలిగిన విద్యుత్‌ లైట్లు మాత్రమే ఉపయోగించాలని.. సాకెట్లను ఓవర్‌లోడ్‌ చేయరాదని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్‌ 100, 101, 112 లేదా పోలీస్‌ కంట్రోల్‌రూమ్‌ 87126 70399 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

జాగ్రత్తలు పాటించాలి..



బాణాసంచా కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని 108 రాష్ట్ర అధికారి బి.సుధాకర్‌ సూచించారు. ధ్వని అధికంగా వచ్చే టపాసులు కల్చకపోవడం మంచిదని.. శరీరానికి వదులుగా ఉండే నూలు దుస్తులు, కాళ్లకు చెప్పులు, కంటి అద్దాలు మాస్కు ధరించాలని తెలిపారు. ఈ దీపావళికి అత్యవసర పరిస్థితులు 5శాతం నుంచి 10 శాతం వరకు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం అగ్ని ప్రమాదాలే కాకుండా యాక్సిడెంట్లు, విద్యుత్‌ షాక్, గర్భిణులకు పురిటినొప్పులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 108 బృందం రాష్ట్రవ్యాప్తంగా హాట్స్‌ స్పాట్‌ ప్రాంతాల్లో అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచి ఘటనా స్థలానికి వీలైనంత త్వరగా చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అత్యవసర సమయంలో 108 టోల్‌ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మద్యం దుకాణాల టెండర్ల గడువు పెంపు


- ఈ నెల 23 వరకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్‌ క్రైం: మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ కమిషనర్‌ శనివారం అర్ధరాత్రి తర్వాత ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్‌ 26 నుంచి ఈ నెల 18 వరకు దరఖాస్తుల స్వీకరించగా ఉమ్మడి జిల్లాలో 227 దుకాణాలకు 5,183 దరఖాస్తులు వచ్చాయి. అయితే 2023 సంవత్సరంలో చేసిన టెండర్ల ప్రక్రియ కంటే ఈసారి దరఖాస్తులు గణనీయంగా తగ్గడంతో మరోసారి గడువు పెంచారు. ఈ నెల 23 వరకు టెండర్ల ప్రక్రియ నిర్వహించి ఈ నెల 27న కలెక్టరేట్‌లో లక్కీ డిప్‌ ద్వారా దుకాణాల కేటాయింపు చేయనున్నారు. మద్యం వ్యాపారులకు మరో మూడు రోజులపాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కలిసి వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో కొంత మేర టెండర్లు పెరగవచ్చని ఎక్సైజ్‌ అధికారులు భావిస్తున్నారు.

జిల్లాల వారీగా వచ్చిన టెండర్లు ఇలా..

మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	నారాయణపేట	జోగుళాంబ గద్వాల	వనపర్తి
1,554	1,424	806	723	676

వీరులారా.. వందనం



- ఉమ్మడి జిల్లాలో అమరులైన 39 మంది పోలీసులు
- సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం
- బాధిత కుటుంబాలకు అండగా పోలీస్‌ శాఖ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- రేపు పోలీస్‌ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

మహబూబ్‌నగర్‌ జిల్లాకేంద్రంలో అమరవీరుల స్తూపం

మహబూబ్‌నగర్‌ క్రైం/ కొల్లాపూర్‌: విధి నిర్వహణలో అసువులు బాసినవీరులు వారు.. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించే క్రమంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయని నిర్భయులు.. ఎక్కడ బాంబు పేలినా.. ఎక్కడ తుపాకులు గర్జించినా.. వెనకా ముందు చూడకుండా దూసుకుపోతారు.. శత్రువులతో జరిగే పోరాటంలో తుదిశ్వాస వరకు పోరాడుతారు. అలాంటి పోరాటాల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీస్‌ అమరవీరుల జ్ఞాపకాలు పదికాలాలపాటు పదిలంగా దాచే ప్రయత్నం చేస్తోంది పోలీస్‌ శాఖ. ఏటా ఒకరోజు వారిని స్మరించుకునే ఏర్పాట్లు చేసింది. కర్తవ్య నిర్వహణలో వెన్నుచూపని ఆ ధీరులను స్మరించుకోవడానికి ప్రతిఏటా అక్టోబర్‌ 21న పోలీస్‌ అమరవీరుల దినోత్సవం చేపడుతారు. ఈ క్రమంలోనే మంగళవారం పోలీస్‌ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఇక్కడి నుంచే ప్రకటన

శాంతిభద్రతల పరిరక్షణ కోసం నక్సలైట్ల కాల్పుల్లో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం గతంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించేది కాదు. అయితే 1997లో లక్ష్మాపూర్‌ ఘటనలో మృతి చెందిన వారిని పరామర్శించేందుకు అప్పటి హోంమంత్రి మాధవరెడ్డి మహబూబ్‌నగర్‌ జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఈ క్రమంలో పోలీస్‌ కుటుంబాలు మంత్రి దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి రూ.1.50 లక్షలు అమరవీరుల కుటుంబ సభ్యులకు ఇచ్చేలా ఎస్పీకి అధికారం కల్పించగా.. ఇప్పటికీ కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచారు. అలాగే ఒక ప్లాటు, రైల్వే ప్రయాణం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తున్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీస్‌ సిబ్బంది కుటుంబ సభ్యులకు మహబూబ్‌నగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి పాలమూరులో మావోయిస్టుల తూటాలకు ఇప్పటి వరకు 39 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు.

- 1990లో కోడేరు మండలం తుర్కదిన్నె వద్ద ఎమ్మెల్యే ఇంటిపై మావోయిస్టులు దాడి చేసిన ఘటనలో ప్రభాకర్‌ అనే కానిస్టేబుల్‌ బలయ్యాడు.
- 1991లో వంగూరు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయగా ఖాజాపాషా అనే కానిస్టేబుల్‌ మృతి చెందాడు. అదే ఏడాది కొల్లాపూర్‌లోని ఓ హోటల్‌లో ప్రభాకర్‌ అనే కానిస్టేబుల్‌ భోజనం చేస్తుండగా నక్సలైట్లు కాల్చి చంపారు.
- 1993లో కొల్లాపూర్‌ మండలం సోమశిల వద్ద అప్పటి మహబూబ్‌నగర్‌ ఎస్పీ పరదేశి నాయుడు, సిబ్బందితో కలిసి బస్సులో వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ దుర్ఘటనలో ఎస్పీతో పాటు ఇద్దరు ఎస్‌ఐలు కిషోర్‌కుమార్, శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్‌ రంగారెడ్డి, కానిస్టేబుళ్లు సుభాన్, జహబ్‌ ఇక్బాల్, జయరాం, వైఎస్‌ ప్రసాద్‌ అక్కడికక్కడే మృతిచెందారు.
- 1994లో తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌పై మావోయిస్టులు జరిపిన దాడులో ఫయోద్దీన్‌ అనే కానిస్టేబుల్‌ మృతిచెందాడు.
- 1996లో కొల్లాపూర్‌ మండలం కుడికిళ్లలో ఎన్నికల విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ మురళీధర్‌రెడ్డిని నక్సల్స్‌ కాల్చిచంపారు.
- 1997లో బల్మూర్‌లో పరీక్షల బందోబస్తు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ చంద్రశేఖర్‌ నక్సల్స్‌ తూటాలకు బలయ్యాడు. అదే ఏడాదిలో అమ్రాబాద్‌ పరిధి లక్ష్మాపూర్‌ నుంచి ట్రాక్టర్‌లో వెళ్తున్న ఎస్‌ఐ మాల్యానా, కానిస్టేబుళ్లు నాగేశ్వరుడు, జగదీశ్వర్‌రెడ్డి, మారెప్ప, శంకరయ్య మందుపాతరలకు బలయ్యారు. అదే ఏడాదిలో అమ్రాబాద్‌ వద్ద పోలీసులు, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మహబూబ్‌ అలీఖాన్‌ అనే కానిస్టేబుల్‌ మరణించాడు.
- 1999లో వీపనగండ్ల వద్ద నక్సల్స్‌ పేల్చిన మందుపాతరకు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, గోపాల్‌ బలయ్యారు.
- 2000 ఏడాదిలో కానిస్టేబుల్‌ హన్మనాయక్‌ను హతమార్చారు.
- 2001లో హోంగార్డు శ్రీనివాసరాజును అచ్చంపేట పరిధిలోని ఎదిరలో మావోయిస్టులు హతమార్చారు. అదే ఏడాదిలో ఆమనగల్‌ సమీపంలోని కాటన్‌మిల్లు వద్ద జరిగిన ప్రమాదాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన ఎస్‌ఐ హన్మంతురెడ్డిని నక్సలైట్లు కాల్చిచంపారు.
- 2002లో మన్ననూర్‌ పండరీ అనే కానిస్టేబుల్‌ చంపేశారు.
- 2004లో కొల్లాపూర్‌ ఎమ్మెల్యే గన్‌మెన్‌గా ఉన్న హమ్లానాయక్, వెంకట్‌రెడ్డిలను తుపాకీతో కాల్చిచంపారు. అదే ఏడాది అడ్డాకుల ఎంపీపీ కందూరు నారాయణ గన్‌మేన్‌ సుగుణాకర్‌ను కాల్చిచంపారు.
- 2005లో బాలానగర్‌ ఎస్‌ఐని హతమార్చేందుకు మావోయిస్టులు రెక్కీ నిర్వహించి.. చివరకు ప్రకాష్‌ అనే కానిస్టేబుల్‌ కాల్చారు. ఇదే ఏడాదిలో అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌ ఎదుట నిల్చొని ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌ లక్ష్మయ్య, కానిస్టేబుల్‌ శేఖర్‌నాయక్‌లను మావోయిస్టులు కాల్చిచంపారు.
- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి గన్‌మెన్‌ రాజారెడ్డి నక్సల్స్‌ తూటాలకు బలయ్యారు. అలాగే చిన్నచింతకుంట ఎస్‌ఐ అహ్మద్‌ మోహియుద్దీన్‌ను పోలీస్‌స్టేషన్‌ ఎదుటే పట్టపగలు కాల్చిచంపారు.
- 2006లో కొండనాగులలో జహంగీర్‌ అనే హెడ్‌కానిస్టేబుల్, అదే ఏడాది కూంబింగ్‌ నిర్వహిస్తున్న జోష్‌బాబు అనే గ్రేహౌండ్‌ కానిస్టేబుల్‌ను అత్యంత దారుణంగా హతమార్చారు. అదే ఏడాది కొల్లాపూర్‌ పరిధిలోని సింగోటం వద్ద రమేష్‌ అనే కానిస్టేబుల్‌ మావోల తూటాలకు బలయ్యాడు.

ఎల్లప్పుడూ అండగా ఉంటాం..

అమరవీరుల కుటుంబ సభ్యులను కేవలం అమరవీరుల సంస్మరణ దినోత్సవం రోజు కాకుండా ఎప్పుడు సమస్య వస్తే అప్పుడు ఆదుకోవడానికి శాఖ సిద్ధంగా ఉంటుంది. వారికి ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాల విషయంలో ఉన్న పెండింగ్‌ పనులు పూర్తిచేసి అందజేయడం జరిగింది. వారి కుటుంబ సమస్యలతోపాటు పిల్లల చదువులకు సంబంధించిన విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. జిల్లాలో రెండు అమరవీరుల కుటుంబాలు ఉన్నాయి.

– జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

ప్రజా సంక్షేమమే లక్ష్యం



లబ్ధిదారులతో కలిసి బోరుమోటారును ప్రారంభించిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ధన్వాడ: రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ధన్వాడ మండలం కిష్టాపూర్‌లో దళిత రైతులకు ఎస్సీ కార్పొరేషన్‌ ద్వారా మంజూరైన 23 బోరుమోటార్లను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రూ. 418కోట్లతో చేపట్టనున్న కృష్ణా–వికారాబాద్‌ రైల్వేలైన్‌ నిర్మాణంతో నారాయణపేట ప్రజలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుందన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కొడంగల్‌–పేట ఎత్తిపోతల పథకంతో జిల్లా సస్యశ్యామలంగా మారుతుందన్నారు. జిల్లా రైతాంగానికి సాగునీటి వసతి కల్పించేందుకు భారీ ప్రాజెక్టును మంజూరుచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో జిల్లాలో ఏ ఒక్కరికీ కూడా డబుల్‌బెడ్రూం ఇల్లు, రేషన్‌ కార్డులు మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల కాలంలోనే సొంతిల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ముందుగానే బేస్‌మెంట్‌ నిర్మించుకున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ రేషన్‌ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. కాగా, కిష్టాపూర్‌లో దళిత రైతులకు రూ. 24,51,800 వ్యయంతో 23 బోర్లను డ్రిల్లింగ్‌ చేయించి.. విద్యుత్‌ బోరు మోటార్లను బిగించినట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్‌ ఏడీ ఖలీల్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్‌ సింధూజ, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సదాశివారెడ్డి, జేఏసీ మాజీ చైర్మన్‌ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి, మాజీ సర్పంచ్‌ దామోదర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, రాఘవేందర్‌రెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ తనిఖీల్లో అవినీతి గుట్టురట్టు

కృష్ణా ఆర్టీఏ చెక్‌పోస్టులో రూ.30 వేల అనధికార డబ్బు గుర్తింపు

- ఒక్కో లారీకి ఒక్కో రేటు చొప్పున డబ్బువసూలు
- తనిఖీల సమయంలోనూ డబ్బులు టేబుల్‌పై పెట్టి వెళ్లిన లారీ డ్రైవర్లు
- ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేస్తాం : ఏసీబీ డీఎస్పీ సీహెచ్‌ బాలకృష్ణ



తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారుల బృందం

మహబూబ్‌నగర్‌ క్రైం: ఒకవైపు ఏసీబీ అధికారుల బృందం ఆర్టీఏ చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తుంటే.. మరోవైపు లారీ డ్రైవర్లు ఒక్కొక్కరుగా అక్కడ ఏం జరుగుతుందో అని కూడా పట్టించుకోకుండా జేబులో నుంచి డబ్బులు తీసి టేబుల్‌పై పెట్టి వెళ్తున్నారు.. ఈ దృశ్యాలన్నింటిని ఏసీబీ అధికారులు వీడియో తీయడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారుల బృందం సోదాలు చేయగా నారాయణపేట జిల్లా కృష్ణా ఆర్టీఏ చెక్‌పోస్టులో మహబూబ్‌నగర్‌ ఏసీబీ డీఎస్పీ సీహెచ్‌ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, పది మంది బృందం కలిసి శనివారం అర్ధరాత్రి 12.30 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. దాదాపు ఆరు గంటలపాటు సాగిన తనిఖీల్లో అనేక అక్రమ అంశాలను గుర్తించారు. ఇటీవల ప్రభుత్వం జీఓ 58 ప్రకారం ఆర్టీఏ చెక్‌పోస్టులు ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్న క్రమంలో మూడు నెలలపాటు చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి కలెక్షన్స్‌ చేయకుండా ఆన్‌లైన్‌లో చలాన్స్‌ చెల్లించడం ఇతర అంశాలపై లారీ డ్రైవర్లతోపాటు అన్ని రకాల డ్రైవర్లకు అవగాహన కలిగించడంతోపాటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించింది. కానీ, కృష్ణా చెక్‌పోస్టులో అలాంటి అంశాలు కాకుండా లారీ డ్రైవర్ల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారు. చెక్‌పోస్టులో సరైన లైటింగ్‌ లేకపోవడం, ఉన్న రెండు సీసీ కెమెరాలు సైతం సక్రమంగా పనిచేయడం లేదని, ప్రధానంగా వసూళ్ల కోసం ప్రైవేట్‌ వ్యక్తులను పెట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ బృందం తనిఖీలు చేస్తున్న సమయంలో చెక్‌పోస్టులో ఏఎంవీఐ ప్రవీణ్‌కుమార్‌ విధుల్లో ఉన్నారు. చెక్‌పోస్టులో రశీదులు లేకుండా అనధికారమైన డబ్బులు రూ.30,450 గుర్తించారు.

నివేదిక అందిస్తాం..

కృష్ణా చెక్‌పోస్టులో చేసిన తనిఖీలపై ఏసీబీ డీఎస్పీ సీహెచ్‌ బాలకృష్ణ 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు. ఆకస్మికంగా చేసిన తనిఖీల్లో అనేక అక్రమ అంశాలను గుర్తించామని, ఈ చెక్‌పోస్టుపై డీటీవోతోపాటు ఇతర ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు గుర్తించామని వీటన్నింటిపై నివేదిక తయారు చేసి డీజీకి అందజేస్తామన్నారు. దీనిపై సంబంధిత అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని డీఎస్పీ తెలిపారు.

ఒక్కో లారీకి ప్రత్యేక రేటు

కృష్ణా ఆర్టీఏ చెక్‌పోస్టు దగ్గర సరిహద్దు దాటే లారీలకు స్థానిక అధికారులు ఒక్కో లారీకి ప్రత్యేక రేట్లు నిర్ణయించారు. 14 టైర్ల లారీ, బొగ్గు లారీ, బూడిద లారీ, ఇసుక, బియ్యం ఇలా ఒక్కో దానికి నిర్ణయించిన ధరల ప్రకారం చెక్‌పోస్టు దగ్గరకు లారీ వచ్చిన తర్వాత పక్కనే నిలిపి వచ్చి ముందే నిర్ణయించిన ధరల ప్రకారం డబ్బులు టేబుల్‌ మీద పెట్టి వెళ్లాలి. ఇలా రోజువారి కలెక్షన్‌ రూ.వేలల్లో ఉంటుంది. ఇక సరైన డాక్యుమెంట్స్, ఓవర్‌ లోడ్‌ ఇతర వాటికి అధిక మొత్తంలో రేట్లు నిర్ణయించారు.

రామన్‌పాడుకు 1,260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం నాటికి 1,021 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వ ద్వారా 130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్‌ కాల్వ ద్వారా 875, కుడి ఎడమ కాల్వలకు 55, వివిధ లిఫ్టుల ద్వారా 873, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్‌ తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- హానికర బాణాసంచాకు దూరంగా ఉండాలి
- చిన్నారులతో జాగ్రత్త
- పర్యావరణ హితమే మేలు



మహబూబ్‌నగర్‌లో బాణాసంచా కొనుగోలు చేస్తున్న ప్రజలు

మహబూబ్‌నగర్ క్రైం: వెలుగు పూలు పూయించే దీపాల పండగ దీపావళి కొందరికీ సంతోషాన్ని.. మరికొందరికి అనారోగ్యాన్ని మోసుకొస్తోంది. ఆనందం కోసం కాల్చే టపాసులు పర్యావరణానికి తూట్లు పొడుస్తూ ప్రాణికోటి మనుగడకే ముప్పు తెస్తున్నాయి. ఇదే సమయంలో మోతల మాటున శబ్ద కాలుష్యం, వెలుగుల మాటున రసాయన కాలుష్యం వెదజల్లుతూ ప్రకృతికి హాని కల్గిస్తోందన్న వాదన ఉంది. ఇటీవల సుప్రీంకోర్టు నిర్ణీత సమయం వరకు టపాసులు కాల్చుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

ఎక్కువ శబ్దాలు వింటే..

టపాసులు కాల్చే సమయంలో ఎంతో ఆనందిస్తాం. కానీ అవి విడుదల చేసే వాయువులు, దుమ్ము, శబ్దాలు ఎంతో మందికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయి. వాతావారణం పూర్తిగా నాశనం అవుతుంది. ఎక్కువ శబ్దం వచ్చే టపాసులు కాల్చడం వల్ల చెవులకు హాని కలిగే ప్రమాదం ఉంది. మనిషి సాధారణంగా వినే శబ్దాల తీవ్రత 60 నుంచి 65 డెసిబుల్స్ మధ్య ఉంటుంది. అంతకంటే ఎక్కువ తీవ్రత కల్గిన శబ్దాల వల్ల మనిషి వినికిడి శక్తి కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిసస్తున్నారు.

గాలిలో కలుస్తున్న దుమ్ము కణాలు

దీపావళి పండగ సందర్భంగా వారం రోజుల పాటు కాల్చే టపాసుల కారణంగా శబ్దాలే కాకుండా పొగ, దుమ్ము, దూళి గాలిలో పెద్ద మొత్తంలో కలుస్తాయి. నేల మీద టపాసులు పేలినప్పుడు ఆ శబ్దాల తీవ్రతకు దుమ్ము ఒక్కసారిగా పెద్ద మొత్తంలో గాలిలోకి చేరుతుంది. మహబూబ్‌నగర్ పట్టణంలో సాధారణ రోజులల్లో రోడ్లపై దుమ్ము కణాలు 30 నుంచి 35 ఆర్ఎస్‌పీఎం (రెస్పిరబుల్ సస్పెండబుల్ పార్టిక్యులేట్ మ్యాటర్) శాతంగా ఉంటాయి. అదే దీపావళి రోజు 52శాతం వరకు చేరుతున్నట్లు సమాచారం. గాలిలో 50 శాతం దుమ్ము కణాలు ఉంటే ఆరోగ్యానికి మంచిది కాదు.

ఆరోగ్యంతో జాగ్రత్త

వినలేని శబ్దాలను అదే పనిగా వింటూ ఉండటం వల్ల ఆరోగ్యం మీద ప్రభావం చూపుతుంది. రక్తపోటు, గుండె జబ్బులు ఉన్న వారి ఆరోగ్యానికి ఇలాంటి శబ్దాలు మరింత ప్రమాదకరం. ముఖ్యంగా పెద్ద శబ్దాలు వినడం వల్ల తలనొప్పి, రక్తపోటు, అజీర్ణం వంటి సమస్యలతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మైగ్రేన్‌తో బాధపడేవారికి శబ్దాలు వింటే రెండు గంటల పాటు తీవ్రమైన తలనొప్పి వస్తుంది. శబ్ద ప్రభావం పసిపిల్లలు, వృద్ధులు, గర్భిణులపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది.

ఇలా చేస్తే ఇబ్బంది ఉండదు

టపాసులు కాల్చే సమయంలో వచ్చే పొగ ఎక్కువగా మనుషులపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ముక్కు, నోటికి మాస్క్, చెవుల్లో దూది లాంటివి పెట్టుకోవడం మేలు. టపాసుల నుంచి వచ్చే కాలుష్యం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి కాటన్ దుస్తులు ధరించాలి.

దగ్గర ఉండి కాల్చకండి..

దీపావళి పండగ సందర్భంగా ప్రతి ఒక్కరూ టపాసులు కాల్చడానికి రూ.వేలు ఖర్చు చేసి అధిక స్థాయిలో టపాసులు కొనుగోలు చేస్తారు. వాటిని దగ్గర నుంచి కాల్చడం వల్ల 91 డెసిబుల్స్ తీవ్రత గల శబ్దాలను స్పష్టంగా వినిపిస్తాయి. 100 డెసి బు ల్స్ తీవ్రత గల శబ్దాలను 15 నిమిషాల వరకు.. 112 డెసిబుల్స్ శబ్దాలను ఒక నిమిషం పాటు వినగలం. 140 డెసిబుల్స్ శబ్దం మనుషులు వింటే వినికిడి శక్తి కొంత మేరకు కోల్పోవడానికి అవకాశం ఉంది. తీవ్రమైన శబ్దం వచ్చే బాణాసంచా 140 నుంచి 150 డీబీ శబ్ద తీవ్రత విడుదల చేసే ప్రమాదం ఉంది.

శబ్ధాలతో ప్రమాదం

టపాసులు కాల్చుతున్న సమయంలో అతి ధ్వనులనిచ్చే వాటికి దూరంగా ఉండాలి. భారీ శబ్దాల కారణంగా కర్ణభేరి పగిలి కొన్నిసార్లు వినికిడి శక్తి కోల్పోవాల్సి వస్తోంది. దీపావళి సమయంలో ఇలాంటి వారు చాలా మంది చికిత్స కోసం వస్తుంటారు. బాణాసంచా నుంచి వెలువడే హానికర రసాయనాల ద్వారా పొగతో ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ సందీప్‌కుమార్, పల్మానాలజిస్ట్

కురుమూర్తి దారులకు మోక్షం!

- రోడ్డుకిరువైపులా ముళ్లపొదల తొలగింపు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



గూడూర్ సమీపంలో రోడ్డు పక్కల ముళ్ల పొదలను తొలగిస్తున్న జేసీపీ

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కురుమూర్తి రహదారులన్నింటికీ అధికారు లు మరమ్మతులు చేపట్టారు. ముఖ్యంగా రహదారులకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదల తొలగింపు, గుంతల పూడ్చివేత తదితర పనులు చేపట్టారు. ఆదివారం అమ్మాపురం, దేవరకద్ర, అల్లీపురం, అడ్డాకుల మండలంలోని వర్నే ముత్యాలంపల్లి, రోడ్లకు జేసీపీలను పెట్టి ముళ్ల పొదలను తొలగిస్తున్నారు.

రోడ్ల మరమ్మతుకు ప్రతిపాదనలు

కురుమూర్తి స్వామి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఈ సంవత్సరం ముందస్తుగానే ఆలయ అధికారులు ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్ అధికారులకు ప్రతిపాదనలు పెట్టారు. అందుకు రెండుమూడురోజుల క్రితమే పంచాయతీరాజ్ నుంచి గ్రా మా ల్లో మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఆర్అండ్‌బీ నుంచి నిధులు మంజూరు కా కున్న బ్రహ్మోత్సవాల సమయం దగ్గర పడుతుందన్న ఉద్దేశంతో ప్రధాన రోడ్ల మరమ్మతులు చేపట్టారు.

పీఆర్ నిధులు మంజూరు

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని చిన్నచింతకుంట మండలంలోని పలు గ్రామా ల్లో స్వామివారి ఉత్సవ కార్యక్రమాలు చేపడుతారు. అందుకు ఆయా గ్రామాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు రోడ్ల మరమ్మతులు చేపడుతున్నారు. అందుకు నిధులు కూడా మంజూరు చేశారు. చిన్నవడ్డేమాన్ నుంచి అప్పంపల్లి వరకు ఉద్దాల బాటకు రూ.40వేలు, అప్పంపల్లి నుంచి గ్రామ సమీపంలోని వాగు వరకు ఉద్దాల బాటకు రూ.లక్ష, తిర్మలాపురం సమీపం నుంచి గ్రామ సమీపంలోని వాగు వరకు ఉద్దాల బాటకు రూ.లక్ష, కురుమూర్తి గ్రామం నుంచి అమ్మాపురం వరకు దేవుని బాటకు రూ.1.20లక్షలు, అమ్మాపురం నుంచి గ్రామ వాగుకు, కురుమూర్తి గ్రామం వరకు రూ.75వేలు, ఉంధ్యాల నుంచి చిన్నచింతకుంట వరకు రూ.70వేలు, అమ్మాపురం నుంచి గూడూరు వరకు రూ.75వేలు, అప్పంపల్లి నుంచి అమ్మాపురం, రాజోళి బాటకు రూ.1.20లక్షలు, లాల్‌కోట నుంచి పల్లమరి వరకు రూ.60వేలు, మద్దూర్ నుంచి గ్రామ వాగు వరకు రూ.30వేలు, కొకుంట్ల నుంచి పొన్నకల్, రాచాల, ఇప్రంపల్లి వరకు రూ.2లక్షలు మంజూరు చేశారు. ఈ పనులను త్వరలోనే చేపట్టి పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతిపాదనలు పెట్టిన పనులు

కురుమూర్తి స్వామి ఆలయానికి వచ్చే రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు ఆలయ అధికారులు పదిరోజుల క్రితం ఆర్అండ్‌బీ అధికారులకు ప్రతిపాదనలు పెట్టారు. మహబుబ్‌నగర్, వనపర్తి డివిజన్లకు సంబంధించి మహబుబ్‌నగర్ జిల్లాకు చెందిన దేవరకద్ర నుంచి అమ్మాపురం, ఆత్మకూర్ వరకు, అల్లిపురం నుంచి లాల్‌కోట క్రాస్ రోడ్డు వరకు, దేవరకద్ర నుంచి తిర్మలాపురం, అప్పంపల్లి వరకు, దేవరకద్ర నుంచి కొకుంట్ల, వెంకంపల్లి, కురుమూర్తి దేవస్థానం వరకు, వనపర్తి డివిజన్ చెందిన లక్ష్మీపురం నుంచి కొత్తకోట వరకు, కొన్నూర్ నుంచి నెల్విడి వరకు, మదనాపురం నుంచి కురుమూర్తి దేవస్థానం వరకు మరమ్మతులు చేపట్టాలని ప్రతిపాదనలు పెట్టారు. అయితే మహబుబ్‌నగర్ డివిజన్ అధికారులు మాత్రం ఆదివారం పనులు చేపట్టారు. వనపర్తి డివిజన్‌వారు ఇంకా పసనులు చేపట్టలేదు.

ఉత్సాహంగా యోగాసన క్రీడా ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా యోగాసన క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ నిరంతరం యోగా సాధన చేయడం వల్ల ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. యోగా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటాలని కోరారు. ఉమ్మడి జిల్లా యోగాసన క్రీడా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 130 మంది క్రీడాకారులు హాజరయ్యారని, ఎంపికైన వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి శ్రీనివాసులు, శరణ్య, మణికంఠ, పవన్‌కుమార్, కె.వెంకటేశ్ పాల్గొన్నారు.



జూరాలకు స్వల్పంగా వరద

- 28 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నాలుగు యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 28వేల క్యూసెక్కులకు చేరినట్లు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 29,661 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 650 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 200 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 32,362 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.255 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 882.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 882.2 అడుగుల వద్ద 200.1971 టీఎంసీల నీటినిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 23,166, సుంకేసుల నుంచి 2,280 మొత్తం 25,446 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తుంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తు 14,166 మొత్తం 49,481 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 6,500, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి 1,476, ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.149 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 1.186 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యామ్‌కు ఎగువ నుంచి 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు జేఈ మహేంద్ర తెలిపా రు. ఎగువ నుంచి వచ్చిన నీ టిని దిగువకు విడుదల చేయ డం లేదని, కేసీ కెనాల్‌కు 2,534 క్యూసెక్కులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్, డీఈ పవన్ కుమార్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 863.610 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించినట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో వరద చేరుతున్న సందర్భంగా 26 వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కిక్‌బాక్సింగ్ లీగ్‌లో ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో శనివారం రాత్రి వరకు జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మితా ఖేలో ఇండియా వుమెన్స్ కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్‌లో జిల్లా క్రీడాకారిణులు ప్రతిభచాటారు. పాయింట్ ఫైట్, లైట్, మ్యూజికల్ ఫాం విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారిణులు 57 పతకాలు సాధించారు. ఇందులో 31 బంగారు పతకాలు, 15 రజతం, 11 కాంస్య పతకాలు సాధించి లీగ్‌లో అగ్రస్థానంలో నిలిచి సత్తాచాటారు. క్రీడాకారిణులు ప్రతిభచాటి పతకాలు సాధించడంపై జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శి రవినాయక్‌లు అభినందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారు త్వరలో జరిగే జోనల్ సెలక్షన్స్‌కు ఎంపికవుతారని తెలిపారు. జోనల్ సెలక్షన్స్‌లో పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

క్లుప్తంగా

కారు ఇంజిన్‌లో మంటలు



జడ్చర్ల: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ కారు ఇంజన్‌లో మంటలు రావడంతో డ్రైవర్ వెంటనే గమనించి కారును నిలిపి వేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని పోలేపల్లి సెజ్ నుంచి జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వైపు వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. కారు ఇంజన్‌లో పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ కారును వెంటనే నిలిపి పరిశీలిస్తుండగానే ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే చుట్టుపక్కల వారు నీటిని చల్లి మంటలను ఆర్పారు. కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి



మల్లయ్య(ఫైల్)

నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో గొర్రెల కాపరి పాము కాటుతో మృతి చెందినట్లు గ్రా మస్తులు తెలిపారు. ఈ ఘటన వివరాలు ఇలా.. కూచూర్‌కు చెందిన చిన్న మల్లయ్య (55) శనివా రం గొర్రెలను ఎప్పటి మాదిరిగా మేతకు తీసుకెళ్లాడు. అక్కడ పొలాల్లో పాము కాటువేయగా అంతగా పట్టించుకోలేదు.ఏదో పురుగు అని ధీమాగా ఉన్నాడు.తీరా ఇంటికి వచ్చే సరికి విషం ఎక్కడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అనంత రం బాధిత కుటుంబ సభ్యులు అస్పత్రికి తరలించే లోగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

చోరీకి పాల్పడిన దొంగకు దేహశుద్ధి



కొత్తపల్లి: తాగిన మైకంలో దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తి గమనించిన గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మద్దూరు మండలంలోని పెద్దిరిపాడు తండాకు చెందిన రాజునాయక్ కొత్తపల్లిలోని ప్రధాన చౌరస్తా వద్ద శివాలయంలో హుండీ పగలగొట్టి అందులో ఉన్న రూ.1,450 నగదు అపహరించడంతోపాటు ఆలయం ముందున్న బోరు మోటరు కేబుల్ వైరును కటింగ్‌బ్లేడ్‌తో కట్ చేస్తుండగా గ్రామస్తులు గమనించి పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం మద్దూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దొంగను అదుపులోకి తీసుకొని విచారించారు. రాజునాయక్ తాగుడుకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లడంతో అప్పటినుంచి తాగడానికి డబ్బులేక దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

స్కూటీపై వచ్చి.. కోడిపుంజు అపహరించి



యజమాని గోపాల్‌కు కోడిపుంజును అప్పగిస్తున్న పోలీసులు

జడ్చర్ల: స్కూటీపై వచ్చిన ఇద్దరు యువకులు ఇంటి ముందు ఉన్న ఓ కోడిపుంజును అపహరించుకెళ్లారు. విషయం తెలుసుకున్న కోడి యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. విచారించిన పోలీసులు ఎట్టకేలకు దొంగలను గుర్తించి వారి వద్ద నుంచి కోడిపుంజును స్వాధీనపర్చుకుని యజమానికి అప్పగించడంతో కథ సుఖాంతమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల గ్రామంలో గొర్రెల కాపరి గోపాల్ కోడిపుంజులు పెంచుతున్నాడు. అయితే శనివారం ఇద్దరు యువకులు స్కూటీపై వచ్చి ఇంటి ముందు ఉన్న కోడిపుంజును పట్టుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గమనించిన గోపాల్ కూతురు తండ్రికి చెప్పడంతో అతను ఇంటికి వచ్చి ఇంటి వద్ద గల సీసీ పుటేజీలను పరిశీలించి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతోపాటు చుట్టుపక్కల వారికి చెప్పారు. ఆదివారం నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో సదరు యువకులు కోడిపుంజును విక్రయిస్తుండగా అప్పటికే కోడిపుంజు చోరీ గురించి విన్నవారు గోపాల్‌కు తెలిపారు. అతను పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు వచ్చి కోడిపుంజును అపహరించిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి కోడిపుంజు, స్కూటీని స్వాధీనపర్చుకున్నారు. తర్వాత కోడిపుంజను యజమాని గోపాల్‌కు అప్పగించారు. కోడిపుంజు విలువ రూ.10 వేలు ఉంటుందని, కోడిపుంజులు పెంచి విక్రయించడం తనకు అలవాటు అని గోపాల్ పేర్కొన్నారు. కాగా.. పోలీసులు చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులను మందలించి వదిలిపెట్టినట్లు తెలిసింది.





